# ఓ టెర్రరిస్ట్ కథ

************

ఆవాళ వేసుకున్న పథకం ప్రకారం ఆ ఏరియాకు తిరుగులేని నాయకుడు సూర్యచంద్రరావును కాల్చిచంపాలి—

అందుకు నియమింపబడ్డ రంగా, రాజాలు ఓ గదిలో నిలుచుని వున్నారు. టేబల్‌ను ఆనుకొనివున్న గజేంద్ర ప్లాన్ చెప్పాడు కళ్ళకున్న రంగు కళ్ళద్దాలు తీయకుండానే, పెదాల మధ్య రగులుతున్న కింగ్‌సైజ్ సిగరెట్టును విడవకుండానే – కారాకిళ్ళీలతో కై పెక్కిన రంగా, రాజాలు శ్రద్ధగా వింటున్నారు—

ఉదయం 10-30 గంటలకు సూర్యచంద్రరావు తులసీనగర్‌లో వున్న అనాథ శరణాలయంలో మీటింగ్‌కు హాజరయి 11-30 గంటలకు తిరిగి, కారెక్కి వెళ్ళిపోతాడు – కార్యక్రమం ప్రకారం— కారు అనాథ శరణాలయం లోపలకు వెళ్ళదు. అందుకని రోడ్డుమీదే గేటువద్ద ఆపి వుంటుంది. శరణాలయానికి వెనుకనే ఓ రైస్‌మిల్ వుంది, శరణాలయం గేటుకి ఎదురుగా, రోడ్డుకు అవతల చిన్న పిల్లల స్కూలు వుంది. అందుకని సూర్యచంద్రరావు కార్యక్రమానికి వచ్చేటప్పుడు స్వాగత సన్నాహాలతో రద్దీగా వుంటుంది.

అప్పుడు కాల్చకూడదు, తిరిగి వెళ్ళేటప్పుడు హతమార్చాలి. సూర్య చంద్రరావు కారెక్కే సమయంలో వెనుకనుండి రంగా తుపాకీతో కాల్చాలి. గురి తప్పకూడదు ఒకవేళ తప్పితే గమనించి ముందున్న రాజా చేతిబాంబు విసిరి, హతమార్చాలి, అంతా సెకన్లలో జరిగిపోవాలి. మారణాయుధాలు పరఫెక్ట్ కండిషన్‌లో వుంటాయి. ఉపయోగించే విధానంతో నేర్పు, వొడుపు వుండాలి. ''ఈ ప్రయత్నంలో ఎవరడ్డు వచ్చినా లెక్కచేయవద్దు ఓ. కే? అన్నాడు గజేంద్ర.

''డన్'' అంటూ బయలుదేరారు రంగా, రాజా ఆ పని ఎందుకు చేయాలో, ఎవరికోసం చేయాలో వారికి తెలీదు. వారికి తెలిసింది మనుషుల రక్తం తాగే గజేంద్ర అవసరమైతే ఎవరి రక్తం తాగేందుకైనా అతడు ఆలోచించడు. అతని చేతిలోని రివాల్వర్ ఎప్పుడూ గురి తప్పదు. పని జరిగితే మాత్రం పుష్కలంగా డబ్బుముడుతుంది—

రంగా, రాజా మళ్ళీ స్పెషల్ కారాకిళ్ళీలు పట్టించారు. దానికి ముందు నాలుగు తెల్లటి టాబ్ లెట్లు రెండు పెగ్గులు ఘాటైన మందు బిగించారు. మత్తుమందు పట్టించి సిగరెట్లు ముట్టించారు. వారి వారి మారణాయుధాలు తీసుకొని మోటార్ బైక్స్ ఎక్కారు.

* * *

నిర్దేశిత స్థలాన్ని చేరుకున్నారు వారు వారు ఉండవలసిన చోట్లలో దూరాలలో చెప్పిన టైంలో నిలిచారు. ఇతరుల కెవరికీ అను మానం రాకుండా బైక్స్ పాడైనట్లు సరిదిద్దుకుంటున్నట్లు నటించసాగారు.

సమయం ఉదయం 11-25– అనాధ శరణాలయంలో కార్యక్రమం పూర్తి కావస్తోంది. కెమెరాలు ఫ్లాష్‌లు వెదజల్లుతున్నాయి. మధ్యలో గాంధీ విగ్రహం మౌనంగా వుంది.

11-25 అయింది.

సూర్యచంద్రరావు లేచి అందరికీ నమస్కరిస్తున్నాడు.

మరి కొన్ని క్షణాల్లో అతని ప్రాణాలు అనంతవాయువుల్లో కలిపేందుకు వెలుపల ఇద్దరు యమదూతలు ఎదురు చూస్తున్నారని అతనికి ఎలా తెలుస్తుంది? ఎవడి లోకంలో వాళ్ళున్నారు.

11-27........

సూర్యచంద్రరావు వేదిక దిగుతున్నాడు. మెడలోవున్న పెద్ద పూలమాలను తీసి స్కూలు పిల్లలవైపు విసిరాడు, చిరునవ్వులతో కలిపి—

అదే ఆఖరి నవ్వుకామోసు!

11-28........

కరతాళ ధ్వనులు యింకా పూర్తిగా ఆగలేదు కొంతమంది స్కూలు పిల్లలూ, శరణాలయ అధికారులు సూర్యచంద్రరావును వెంబడింవారు వీడ్కోలు చెబుతూ గౌరవంగా,

రంగా తుపాకి సిద్ధం చేసుకున్నాడు. జాగ్రత్తగా సూర్యచంద్రరావు కారు దగ్గరికి నడిచాడు. డ్రైవర్ కార్‌డోర్ తెరిచాడు. రంగా వేలు ట్రిగ్గర్‌మీద రెడీగా వుంది.

11-30........!!

సూర్యచంద్రరావు కారు ఎక్కబోయాడు. వెనుక నుంచి తుపాకి పేలింది!!

ధన్.... ధన్.... ధన్....

సూర్యచంద్రరావు కారులో కూర్చొని బిత్తర పోయాడు.